సాక్షి అనంతపురం

శుక్రవారం, 17, అక్టోబర్, 2025



చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16 వేలు పలికాయి.



ఈశాన్య రుతుపవనాల ప్రవేశం

జిల్లాలోకి ఈశాన్య రుతుపవనాలు గురువారం ప్రవేశించాయి. ఈ రబీలో 1.08 లక్షల హెక్టార్లలో పంటలు సాగులోకి రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. IIలో

గరిష్టం/కనిష్టం
34.1°/21.4°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. అక్కడక్కడా తేలిక పాటి నుంచి తుంపర్లు పడ్డాయి. ఈశాన్యం నుంచి నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంతకల్లు జంక్షన్ మీదుగా ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా సికింద్రాబాద్-తిరుపతి మధ్య (07498) ఈ నెల 18వ తేదీ మాత్రమే రైలు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ రైలు బేగంపేట, లింగంపల్లి, వికారాబాద్, తాండూర్, యాదగిరి, కృష్ణా, రాయచూర్, మంత్రాలయం, ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట మీదుగా తిరుపతి చేరుతుందన్నారు. అదేవిధంగా ధర్మవరం-షోలాపూర్ (01438) ఈ నెల 18న శనివారం ఒక్క రోజు మాత్రమే ధర్మవరం జంక్షన్ నుంచి బయలుదేరుతుందన్నారు. కదిరి, ములకలచెరువు, మదనపల్లి రోడ్డు, పీలేరు, పాకాల, తిరుపతి, రేణిగుంట, రాజంపేట, కడప, యర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, కృష్ణా,యాదగిరి, వికారాబాద్, బీదర్‌ల మీదుగా షోలాపూర్‌కు రైలు చేరుకుంటుందన్నారు.

సురక్ష యాప్ ద్వారానే మద్యం విక్రయాలు

అనంతపురం సెంట్రల్: జిల్లా వ్యాప్తంగా మద్యం విక్రయాలను ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారానే జరపాలని మద్యం షాపులు, బార్ నిర్వాహకులను ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కల్తీ మద్యంపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం సురక్ష యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి వినియోగదారుడూ తన మొబైల్‌లో ఎక్సైజ్ సురక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని మద్యం బాటిల్‌పై హీల్ స్టిక్కర్‌ను స్కాన్ చేయడం ద్వారా మద్యం అసలుదా? నకిలీదా? అనేది తెలిసిపోతుందన్నారు. అలాగే మద్యం షాపులు, బార్ల నిర్వాహకులు నూరుశాతం మద్యం విక్రయాలు యాప్ ద్వారానే సాగించాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

అరాచకాలతో హడల్

రాక్షస రాజ్యంలా 'రాప్తాడు'

- వరుసగా హత్యలు, దాడులతో భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు
- అధికార పార్టీ నేతలకు తొత్తులుగా మారిన పోలీసులు
- మహిళా ఎమ్మెల్యే నియోజకవర్గంలోనే అబలలపై యథేచ్ఛగా దాడులు
- పరిటాల కుటుంబం మళ్లీ ఫ్యాక్షన్‌ను ప్రోత్సహిస్తోందని సర్వత్రా విమర్శలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: వరుసగా చోటుచేసుకుంటున్న హత్యలు, దాడులతో రాప్తాడు నియోజకవర్గ ప్రజలు వణికిపోతున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన అనతికాలంలోనే రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో కురుబ లింగమయ్య పరిటాల కుటుంబ సమీప బంధువుల చేతిలో దారుణ హత్యకు గురయ్యాడు. ఇంట్లోకి చొరబడి మరీ కట్టెలతో కొట్టి హత్య చేశారు. భూతగాదాలో జోక్యం చేసుకుని రాప్తాడుకు చెందిన దంపతులు చిగిచెర్ల నారాయణరెడ్డి, చిగిచెర్ల ముత్యాలమ్మను టీడీపీ నేతలు దారుణంగా హత్య చేశారు. పాలచెర్ల గ్రామంలో టీడీపీకి ఓటు వేయలేదనే అక్కసుతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలైన శేఖర్, లింగమయ్యపై రాళ్ల దాడి చేశారు. బోగినేపల్లిలో నాగమ్మ, లక్ష్మీనారాయణమ్మపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. పుల్లలరేవు గ్రామానికి చెందిన ఓబులేష్ పొలంలో నేరేడు చెట్లు నరికి నిప్పు పెట్టారు.కనగానపల్లి మండలం భానుకోట, వేపకుంట,కుర్లపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు పాల్పడ్డారు. గుంతపల్లిలో చాకలి నరసింహులు కాలిని వేట కొడవళ్లతో నరికేశారు. చెన్నేకొత్తపల్లి మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్టీడీ శ్రీనివాసరెడ్డి ఇంటిపై దాడి చేశారు.



హత్యకు గురైన కురుబ లింగమయ్య (ఫైల్)



ఎర్రమ్మ తల పగులకొట్టిన దృశ్యం (ఫైల్)

మహిళలకేదీ రక్షణ?

మహిళా ఎమ్మెల్యే ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే మహిళలకు భద్రత లేకుండా పోయింది. ఇటీవల ఆత్మకూరు మండలంలోని తలుపూరు గ్రామంలో టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులైన గోసల కొండన్న, గోసల ఎర్రమ్మ దంపతులపై విచక్షణరహితంగా కర్రలతో దాడి చేసి ఎర్రమ్మ తల పగులకొట్టారు. సంఖ్యా బలం లేకపోయినా రామగిరి ఎంపీపీ పీఠాన్ని కైవసం చేసుకోవాలనే దురుద్దేశంతో ఓ ఎంపీటీసీ సభ్యురాలిని కిడ్నాప్ చేసి భయభ్రాంతులకు గురి చేశారు. బి. యాలేరులో బండి చిన్న అహోబిళం, కొండమ్మ దంపతులపై చెప్పులు, రాళ్లతో దాడి చేసి కొండమ్మకు ఎముకలు విరగ్గొట్టారు. బి.యాలేరులో నడి రోడ్డుపై ఒక మహిళ జుట్టు కత్తిరించారంటే నియోజకవర్గంలో పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక.. కూటమి ప్రభుత్వంలో రామగిరి మండలం ఏడుగుర్రాల పల్లిలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన బాలికపై 14 మంది అత్యాచారం చేసి గర్భం దాల్చేలా చేయడం, దీనిపై గ్రామంలో దుప్పటి పంచాయితీ చేసిన విషయం జిల్లాలోనే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా కూడా కలకలం సృష్టించింది. ఈ ఘటనపై 'సాక్షి' పత్రికలో వరుస కథనాలు వచ్చాకే పోలీసులు మేల్కొని దుండగులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.




టీడీపీ నేతల చేతిలో హత్యకు గురైన చిగిచెర్ల ముత్యాలమ్మ, నారాయణరెడ్డి (ఫైల్)

బాధితులపైనే రివర్స్ కేసులు

దాడులు చేయడమే కాకుండా పోలీసుల సాయంతో బాధితులపైనే రివర్స్ కేసులు బనాయిస్తున్నారు. పరిటాల బంధువుల చేతిలో హత్యకు గురైన లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన సమయంలో ప్రభుత్వం సరైన భద్రత ఏర్పాట్లు చేయకపోగా.. నిబంధనల ఉల్లంఘన అంటూ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో పాటు 120 మంది పార్టీ నాయకులపై కేసులు బనాయించింది. ఆత్మకూరు మండలం సిద్దరాంపురం గ్రామానికి చెందిన కురుబ బాలన్నపై టీడీపీ నాయకులు విచక్షణారహితంగా కర్రలతో దాడి చేయగా.. పోలీసులు బాలన్నపైనే కేసులు నమోదు చేశారు. అనంతపురం రూరల్ కళ్యాణదుర్గం బైపాస్ సమీపంలో 20 ఇళ్లను అధికారులు, పోలీసులను అడ్డం పెట్టుకుని కూల్చి వేయించారు. రామగిరి ఎంపీడీఓ కార్యాలయంలో లేఖ ఇవ్వడానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులపై పరిటాల వర్గీయులు దాడులు చేయడమే కాకుండా బాధితులపైనే అక్రమ కేసులు నమోదు చేయించారు. ఇక.. ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపుతున్న వారిపై కక్ష సాధింపులకు దిగుతున్నారు. ఇటీవల రాప్తాడు మండలంలో సాయి భార్గవ్, సుమంత్‌రెడ్డి, మదిగుబ్బకు చెందిన జింకల రామాంజినేయులుపై కేసులు పెట్టి జైలుకు పంపారు.

పోలీసుల హ్యాండ్సప్..

బాధితులకు అండగా నిలవాల్సిన పోలీసులు వారిపైనే వేధింపులకు దిగుతున్నారు. రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్ 'పచ్చ' కండువా కప్పుకున్న వ్యక్తిలా వ్యవహరిస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఈయన టీడీపీ నుంచి ఎమ్మెల్యే టికెట్‌కు కూడా ప్రయత్నించిన విషయం అందరికీ తెలిసిందే. ఇక.. రాప్తాడు సీఐ శ్రీహర్ష టీడీపీ నేతల ఆదేశాలతో వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేసి అక్రమ కేసులు బనాయిస్తున్నారు.

ఆగడాలు ఎంతో కాలం సాగవు



మా ప్రభుత్వంలో పేరూరు డ్యాంకు నీరు అందించి నియోజకవర్గవాసులకు సంతోషం పంచాం. నేడు గ్రామాల్లో పరిటాల కుటుంబం ఫ్యాక్షన్‌ను ప్రేరేపిస్తూ చిచ్చుపెడుతోంది. హంద్రీ-నీవా కాలువకు లైనింగ్ వేసి రైతులకు తీరని అన్యాయం చేశారు. అనంతపురం రూరల్ పాపంపేటలో అధికారులను అడ్డు పెట్టుకొని 20 ఇళ్లను కూల్చి బాధితులను రోడ్డున పడేశారు. టమాట మండీల్లో శ్రీరామ్ ట్యాక్స్ పేరిట రోజుకు రూ. లక్షల్లో వసూలు చేస్తున్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా కార్యకర్తలకు అండగా ఉంటాం. వారి ఆగడాలు ఎంతో కాలం సాగవని గుర్తుంచుకోవాలి.

– తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే

కలంపై జులుమా?



అనంతపురం: ప్రజల తరఫున పోరాడుతున్న 'సాక్షి' గొంతుక నొక్కడానికి కూటమి ప్రభుత్వం మరోసారి పోలీసులను ప్రయోగించింది. ప్రధాన సంచికలో ప్రచురితమైన వార్తకు సంబంధించి ఇప్పటికే దాఖలు చేసిన రెండు అక్రమ కేసుల్లో 'సాక్షి' ఎడిటర్ ఆర్. ధనంజయ రెడ్డికి కేవలం మూడు రోజుల వ్యవధిలోనే మూడు సార్లు పోలీసులతో నోటీసులు జారీ చేయించింది. ఏకంగా రాష్ట్ర పోలీసులు హైదరాబాద్‌లోని 'సాక్షి' కార్యాలయానికి వెళ్లడాన్ని పరిశీలిస్తే, వారిపై అధికార పెద్దల ఒత్తిడి ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే ప్రజల పక్షాన నిలుస్తున్న జర్నలిస్టుల గొంతు నొక్కేసేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అప్రజాస్వామికమని జర్నలిస్టులు, మేధావులు ముక్తకంఠంతో ఖండిస్తున్నారు.

పత్రికా స్వేచ్ఛను హరించడమే



'సాక్షి' పత్రిక ఎడిటర్‌పై కక్ష గట్టి పోలీసుల సాయంతో వరుసగా కేసులు నమోదు చేయడం ఆక్షేపణీయం. పత్రికల్లో వార్త ప్రచురిస్తే.. ఆ వార్తకు సంబంధించి 'న్యూస్ సోర్స్'ను వెల్లడించాలని పోలీసులు బలవంతం చేయలేరు. వరుసగా కేసులు నమోదు చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమే అవుతుంది.

– డాక్టర్ శంకరయ్య, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ ఇంటలెక్చువల్ ఫోరం

మూల్యం చెల్లించుకుంటారు



పత్రికా స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు. సాక్షి కార్యాలయాలపై దాడులు, ఎడిటర్‌పై కేసులు అప్రజాస్వామికం. వీటికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఇటువంటి దాడులను అన్ని ప్రజా సంఘాలు, జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి.

– సాకే హరి, ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు

దుర్మార్గమైన చర్య



కూటమి ప్రభుత్వం ఉన్నంత కాలం పత్రికలకు గాని, ప్రజలకు గాని అన్యాయాలపై మాట్లాడే అవకాశం ఉండదు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని విభాగాల్లో ప్రజల సొమ్ము దోచేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రశ్నించే పత్రికలపై అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమైన చర్య.

– తలారి రామాంజనేయులు, సీనియర్ జర్నలిస్ట్

క్లుప్తంగా

విమర్శలకు తావివ్వకండి


- ఖజానా సిబ్బందికి నూతన డీడీ రమణయ్య సూచన



నూతన డీడీ రమణయ్యకు శుభాకాంక్షలు చెబుతున్న ఖజానా ఉద్యోగులు

అనంతపురం అర్బన్: విమర్శలు, వివాదాలకు తావివ్వకుండా బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఖజానా ఉద్యోగులకు ఆ శాఖ నూతన డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య సూచించారు. జిల్లా ఖజానా శాఖ కార్యాలయంలోని తన చాంబర్‌లో డీడీగా బాధ్యతలను ఆయన గురువారం స్వీకరించారు. ఇన్‌చార్జ్ డీడీ వెంకటేశ్వర్లు, అధికారులు, ఉద్యోగులు నూతన డీడీకి పుష్పగుచ్ఛాల అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ.. కార్యాలయానికి వచ్చే వారు ఏపని మీద వచ్చారో తెలుసుకుని పూర్తిచేసి పంపాలన్నారు. ఏ దశలోనూ విమర్శలు, వివాదాలు, ఆరోపణలకు ఆస్కారం ఇవ్వకుండా బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏటీఓలు రాణి, సరస్వతి, పద్మనాభం, ఎస్టీఓలు, ఖజానా ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శంకరనారాయణ, మహేశ్వరరెడ్డి, నాయకులు ఫారూక్ మహమ్మద్, కోశాధికారి అనంతయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు తిరుమలరెడ్డి, ఉపాధ్యక్షులు సుమనలత, శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులు సాదికా ఖానూమ్, డి.శ్రీనివాసులు,, రాజేష్, నాయకులు చల్లా కిషోర్, మహబూబ్‌బాషా, ఉద్యోగులు షాషా, శివారెడ్డి పాల్గొన్నారు.

వరల్డ్ బుక్ ఆఫ్ ఇండియా రికార్డ్స్‌లో సాయిబాబా విగ్రహానికి చోటు



తాడిపత్రి టౌన్: స్థానిక సంజీవనగర్‌లో ఉన్న శివసాయి మందిరంలో వెలసిన సాయి బాబా విగ్రహానికి వరల్డ్ బుక్ ఆఫ్ ఇండియా రికార్డ్స్ లో చోటు దక్కింది. గురువారం సంస్థ సభ్యులు తాడిపత్రిలోని శివసాయి మందిరాన్ని సందర్శించారు. జైపూర్‌కు చెందిన శిల్పులు 7.5 టన్నుల బరువున్న ఒకే మార్బుల్‌తో 9.5 అడుగుల ఎత్తున్న విగ్రహాన్ని చూడచక్కగా రూపుదిద్దినట్లుగా గుర్తించారు. అనంతరం రికార్డుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

నేడు అండర్-17 వాలీబాల్ బాలబాలికల జట్ల ఎంపిక

గుంతకల్లు: స్థానిక ఎస్ఆర్‌కే మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం మండల స్థాయి అండర్-17 వాలీబాల్ బాలబాలికల జట్లను ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు ఎస్‌జీఎఫ్ మండల కో-ఆర్డినేటర్ పి.సత్యనారాయణ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. క్రీడాకారులు ఉదయం 10 గంటలకు ఎస్ఆర్‌కే హైస్కూల్‌లో రిపోర్ట్ చేసుకోవాలి. పూర్తి వివరాలకు 94412 82507లో సంప్రదించవచ్చు.

బండారు ఇలాకా.. సమస్యల తడాఖా

శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తన సొంత నియోజకవర్గ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. రహదారులు అధ్వానంగా ఉన్నా ఏ మాత్రమూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ గ్రామానికి వెళ్లాలన్నా నరకప్రాయంగా ఉంటోందని వాపోతున్నారు. 'గెలిచిన తర్వాత ఎమ్మెల్యే గ్రామాలకు వెళ్లడమే మానేశారంట! నియోజకవర్గ స్థాయి నేతలకు సైతం అందుబాటులో ఉండడం లేదు, అలాంటిది ఇక రోడ్ల గురించి ఏం పట్టించుకుంటారు' అని ప్రజలు మండిపడుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



రేగడికొత్తూరు వద్ద గుంతల్లో నిలిచిన వర్షపునీరు



బుక్కరాయసముద్రం వద్ద గుంతలమయమైన రహదారి



కోటంక వీధిలో ప్రవహిస్తున్న మురుగు



గుంతల్లో వాహనాన్ని నడపలేక తోసుకుంటూ వెళుతున్న కొట్టాలపల్లి వాసి



పొదరాళ్ల సమీపంలో ప్రధాన రహదారి దుస్థితి



రేగడికొత్తూరుకు చేరుకునేందుకు గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులు



జిగ్‌జాగ్ డ్రైవింగ్ చేస్తే తప్ప మర్తాడుకు వెళ్లలేమంటున్న వాహనదారులు

ఎస్‌జీఎఫ్ క్రీడా జట్ల ఎంపిక



ఎంపికైన వాలీబాల్ బాలుర జట్టు

అనంతపురం కార్పొరేషన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అండర్ – 19 బ్యాడ్మింటన్, వాలీబాల్ జిల్లా జట్లను గురువారం ఎంపిక చేశారు. అనంతపురంలోని అశోక్‌నగర్‌లో ఉన్న జిల్లా క్రీడాప్రాధికార సంస్థ స్టేడియంలో బ్యాడ్మింటన్, జూనియర్ కళాశాల మైదానంలో వాలీబాల్ జట్లను ఎంపిక చేశారు. ఈ ప్రక్రియను ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు, శకుంతల పర్యవేక్షించారు. వాలీబాల్ బాలుర జట్టులో మణికంఠ, కార్తీక్, సాయి చరణ్, శ్రీకాంత్, పవన్‌కుమార్ నాయక్, ధనుష్‌కుమార్, మధు, విష్ణువర్ధన్, విజయసాయి, రెహమాన్, వంశీ, అమర్ చోటు దక్కించుకున్నారు. బాలికల జట్టుకు సాయిబృందా, యమున, శాలిని, శ్వేత, బిందు, దీప్తి, వైష్ణవి, నాగరత్న, సుస్మిత, వేదశ్రీ, హసీనా, లాస్య, యస్మిత ఎంపికయ్యారు. అలాగే బ్యాడ్మింటన్ బాలికల జట్టులో ఎ.అన్విత, ఎస్.హిమబిందు, టి.సన్నిధి, వి.విజయలక్ష్మి, పి.దీక్షిత్ నారాయణ చోటు దక్కించుకోగా, బాలురు జట్టుకు బి.యువరాజు, జతిన్ సాయిరెడ్డి, ఎ.అఖిల్, ఎం.రిత్విక్‌సాయి, కె.కార్తీక్ కుమార్‌రెడ్డి ఎంపికయ్యారు.

వీడని మిస్సింగ్ మిస్టరీ

- ఆరు రోజులైనా లభ్యం కాని బాలుడి ఆచూకీ
- చుట్టుపక్కల ప్రాంతాలన్నీ జల్లెడ పట్టినా ఫలితం శూన్యం



కనిపించకుండా పోయిన రామాంజనేయులు

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం కొడిమి దర్గా కొట్టాలుకు చెందిన 3వ తరగతి విద్యార్థి అదృశ్యంపై మిస్టరీ వీడలేదు. ఆరు రోజులైనా ఆచూకీ లభ్యం కాకపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. చుట్టుపక్కల ప్రాంతాలన్నీ జల్లెడ పట్టినా లాభం లేకపోయింది.

ఏమి జరిగిందంటే..

కొడిమి పంచాయతీ పరిధిలోని దర్గా కొట్టాలుకు చెందిన వేణు, వెంకటలక్ష్మి దంపతులు కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. వీరికి ఓ కూతురు, ముగ్గురు కుమారులు ఉన్నారు. పేదరికం కారణంగా పెద్ద కుమారుడు ఈశ్వర్ చదువుకోలేకపోయాడు. ఉరవకొండలోని గిరిజన గురుకుల పాఠశాలలో రెండో కుమారుడు నరసింహ 6వ తరగతి, మూడో కుమారుడు రామాంజనేయులు 3వ తరగతి చదువుతున్నారు. దసరా సెలవుల అనంతరం ఈ నెల 11న ఇద్దరూ గురుకులానికి బయలుదేరారు. దీంతో ఇద్దరినీ పిలుచుకుని అనంతపురానికి వచ్చిన ఈశ్వర్... వారికి కావాల్సిన సామగ్రిని ఇప్పించి బస్సులో ఉరవకొండకు బయలుదేరారు. రామాంజనేయులు తాను ఇంటికి వెళ్తానంటూ మారం చేస్తూ ఏడుస్తుండడంతో బస్సు రాచానపల్లికి చేరుకోగానే దింపేసి ఈశ్వర్, నరసింహ ఉరవకొండకు వెళ్లిపోయారు.

రామాంజనేయులు ఎక్కడ?

బస్సు దిగిన రామాంజనేయులు సమీపంలోని తమ ఇంటికి వెళ్లకుండా సిండికేట్‌నగర్‌కు వెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. 3వ తరగతి అంటే పదేళ్లలోపు వయసు ఉంటాది. ఒంటరిగా బయట తిరిగే అంత జ్ఞానం కూడా ఉండదు. అలాంటి పిల్లాడు ఎవరి వద్దకు వెళ్లాడు, ఎక్కడికి వెళ్లాడో అంతుచిక్కడం లేదు. ఆరు రోజులు దాటినా ఆచూకీ లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ క్రమంలో బాలుడి కుటుంబానికి సన్నిహితంగా ఉన్నవారిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు సైతం ఆ దిశగా లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నారు. ఉరవకొండకు వెళ్లి పాఠశాలకు వెళ్లి విచారించారు. తల్లిదండ్రులు కూడా కొడిమి, రాచానపల్లి పంచాయతీలతో పాటు అనంతపురం నగరంలో ఆస్పత్రి, ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో ఆరా తీశారు. కాగా, బాలుడి మిస్సింగ్ కేసును సీరియస్‌గా తీసుకున్నట్లు అనంతపురం రూరల్ సీఐ శేఖర్ అంటున్నారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 94407 96811 (సీఐ)కు సమాచారం ఇవ్వాలని కోరారు.

శ్రీదేవికి మెమో

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం రూరల్: మిషన్ శక్తి– మిషన్ వాత్సల్య జిల్లా కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న ఉరవకొండ సీపీడీఓ శ్రీదేవికి ఐసీడీఎస్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి చార్జ్‌మెమో జారీ చేశారు. మహిళాశిశు సంక్షేమశాఖ పరిధిలోని శిశుగృహలో ఈ నెల 3న శిశువు మృతి చెందిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన ఈ అంశంలో ఐసీడీఎస్ పీడీ నాగమణిని అప్పట్లో ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. అయితే శిశువు మృతికి అసలు కారకులపై ఎలాంటి చర్యలు లేకపోవడంతో ఈ నెల 9న 'పసివాడి ప్రాణం.. లెక్కలేని తనం' శీర్షికన 'సాక్షి'లో కథనం వెలువడింది. స్పందించిన ఐసీడీఎస్ డైరెక్టర్ వేణుగోపాలరెడ్డి కథనంలో పేర్కొన్న విధంగా మిషన్ వాత్సల్య జిల్లా కో ఆర్డినేటర్ బాధ్యతారాహిత్యాన్ని ప్రస్తావిస్తూ మెమో జారీ చేశారు. శిశుగృహలో ఉన్న పిల్లల భద్రత, సంక్షేమానికి చర్యలు తీసుకోవడం, ప్రత్యేక దత్తత ఏజెన్సీల పనితీరును పర్యవేక్షించడం, ఆసుపత్రిలో సంరక్షణ, పర్యవేక్షణ ప్రమాణాలు పాటించడంలో మిషన్ వాత్సల్య కో ఆర్డినేటర్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ఫలితంగానే నవజాత శిశువు మృతి చెందినట్లుగా అభియోగాలు వచ్చాయని పేర్కొన్నారు. పదిరోజుల్లో సంజాయిషీ ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కాగా, శిశువు మృతికి కారకులైన శిశుగృహ సిబ్బందిపై కూడా త్వరలో వేటు పడనున్నట్లు సమాచారం.

అసమర్థ ప్రభుత్వాన్ని నిలదీద్దాం

- మాజీ మంత్రి, సాకే శైలజనాథ్



రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ శైలజనాథ్

పుట్లూరు: పాలన చేతకాక వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న అసమర్థ కూటమి ప్రభుత్వాన్ని కోటి సంతకాల కార్యక్రమం ద్వారా నిలదీద్దామంటూ ప్రజలకు మాజీ మంత్రి, శింగనమల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్ పిలుపునిచ్చారు. గురువారం పుట్లూరు మండలం కడవకల్లు, సూరేపల్లి, అరకటివేముల, ఎ.కొండాపురం గ్రామాల్లో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.కడవకల్లులో దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలకు అనుమతులు తీసుకువచ్చారని గుర్తు చేశారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేయడమే లక్ష్యంగా వైద్య కళాశాల నిర్మాణాలు చేపడితే.. వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలని చూడడం సిగ్గుచేటన్నారు. వైద్య విద్య అభ్యసించాలనుకునే విద్యార్థుల కోసం చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శులు విష్ణునారాయణ, రమణాయాదవ్, నాయకులు పద్మావతమ్మ, సర్పంచ్ రామాంజనేయులు, నియోజకవర్గ యవజన విభాగం అధ్యక్షుడు భానుకిరణ్ రెడ్డి, బీసీ సెల్ నాయకుడు నారాయణస్వామి, నాయకులు నాగేశ్వరరెడ్డి, నీలం భాస్కర్, నరసింహారెడ్డి, విశ్వనాథరెడ్డి, నాగేశ్వరరెడ్డి, ఈశ్వర రెడ్డి, నాగముని, రామకేశవ, కుళ్లాయిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, నాగభూషణం, రసూల్, కేశవనాయుడు, కంచెం శ్రీనివాసులరెడ్డి, రామమోహన్, సూరి, పెద్దిరాజు(పెద్దోడు), తదితరులు పాల్గొన్నారు.

'ఓపెనింగ్' అదిరింది



తలపడిన ఆంధ్ర, ఢిల్లీ జట్లు

అనంతపురం కార్పొరేషన్: బీసీసీఐ ఆధ్వర్యంలో అనంతపురం స్పోర్ట్స్ సెంటర్‌లోని ప్రధాన క్రీడా మైదానం వేదికగా గురువారం ప్రారంభమైన సీకే నాయుడు క్రికెట్ ట్రోఫీ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు శుభారంభం చేసింది. తొలి రోజు ఆటముగిసే సమయానికి ఢిల్లీ జట్టుపై 74.2 ఓవర్ల వద్ద రెండు వికెట్లు కోల్పోయి 210 పరుగులతో పటిష్ఠ స్థాయికి చేరుకుంది. వర్షం కారణంగా 15 ఓవర్లు మిగిలి ఉండగానే ఆట ముగిసింది. బీసీసీఐ నూతన నిబంధనల మేరకు టాస్ లేకుండానే అతిథి జట్టుకు బ్యాటింగ్, ఫీల్డింగ్ ఎంచుకునే అవకాశాన్ని కల్పించారు. దీంతో ఢిల్లీ జట్టు మొదట ఫీల్డింగ్ ఎంచుకుంది. అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, కార్యదర్శి భీమలింగారెడ్డి, సహాయ కార్యదర్శి జి.మురళీకృష్ణ, ఏసీఎల్ఓ శర్మాస్‌వలి, తదితరులు పర్యవేక్షించారు. బ్యాటింగ్ బరిలో దిగిన ఆంధ్ర జట్టు ఓపెనర్ సాయిశ్రావణ్ నిలకడగా ఆడుతూ 160 బంతుల్లో 9 బౌండరీలతో 73 పరుగులు చేశాడు. మిడిల్ ఆర్డర్‌గా వచ్చిన మరో బ్యాటర్ జీఎస్‌పీ తేజ 165 బంతుల్లో 8 బౌండరీలతో 73 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఢిల్లీ బౌలర్లలో దేవ్‌లక్రా 47 పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీసుకోగా, భరద్వాజ్ 49 పరుగులు ఇచ్చి ఒక వికెట్ కూలదోశాడు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గుమ్మఘట్ట: ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు పరిస్థితి విషమించడంతో గురువారం మృతిచెందాడు. వివరాలు... గుమ్మఘట్ట మండలం భైరవాని తిప్ప గ్రామానికి చెందిన తిప్పేస్వామి, గంగమ్మ దంపతుల కుమారుడు నవీన్ (25) పది రోజుల క్రితం కళ్యాణదుర్గం మండలం మల్లాపురం గ్రామంలో ఉన్న తన సోదరిని చూసేందుకు ద్విచక్రవాహనం వెళుతుండగా మార్గమధ్యంలో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడిన నవీన్‌ను తొలుత కళ్యాణదుర్గంలో ప్రాథమిక చికిత్స అందజేసి అనంతపురానికి వైద్యులు రెఫర్ చేశారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి వైద్యుల సూచన మేరకు బెంగళూరుకు తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక నవీన్ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఘటనపై కళ్యాణదుర్గం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

స్పాంజ్ ఐరన్ కర్మాగారంలో ప్రమాదం

- ద్రవ రూప ఇనుము పడి ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాలు

తాడిపత్రి టౌన్: మండలంలోని అయ్యవారిపల్లి వద్ద ఉన్న సుగుణ స్పాంజ్ ఐరన్ పరిశ్రమలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రమాదం చోటు చేసుకుంది. ద్రవరూపంలో ఉన్న ఇనుము కార్మికులపై పడడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో కంబగిరి రాముడు, సునీల్, జార్జ్ ఉన్నట్లుగా తెలిసింది. అయితే ఈ విషయాన్ని యాజమాన్యం గుట్టుగా ఉంచింది. క్షతగాత్రులను తాడిపత్రిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రహస్యంగా మరో నగరంలోని ఆస్పత్రికి తరలించారు. ఎలాంటి రక్షణ చర్యలు లేకుండా కార్మికులతో పని చేస్తుండటంతోనే ప్రమాదం చోటు చేసుకున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఇష్టారాజ్యం.. ఈ–స్టాంప్‌ల విక్రయం

- అధిక ధరకు విక్రయిస్తున్నా పట్టించుకోని అధికారులు



రామ్‌నగర్‌లోని రిజిస్ట్రార్ కార్యాలయం

అనంతపురం టౌన్: ఉమ్మడి జిల్లాలో ఈ–స్టాంప్‌లను ఇష్టారాజ్యంగా విక్రయిస్తున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో మొత్తం 21 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఇదే పరిస్థితి. జిల్లా వ్యాప్తంగా 200 మందికి పైగా స్టాంప్ వెండర్లు ఉండగా ఇందులో ఒక్క అనంతపురంలోనే దాదాపు 40 మందికి పైగా ఉండడం గమనార్హం. వీరు కర్నూలులోని స్టాక్ హోల్డింగ్ సంస్థకు ఇండెంట్ పంపి.. ఈ–స్టాంప్ విక్రయాన్ని చేపడుతున్నారు. ప్రతి స్టాంప్ విక్రయంపై వెండర్లకు ప్రత్యేకంగా కమీషన్ ఉంటుంది. ఇది చాలదన్నట్లు ప్రతి స్టాంప్‌పై అదనపు సొమ్ము వసూలు చేస్తున్నారు. రూ.100 స్టాంప్ కావాలంటే రూ.150 చెల్లించుకోవాల్సి వస్తుండడంతో వినియోగదారులపై అదనపు భారం పడుతోంది. రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వెండర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

రిజిస్ట్రేషన్ శాఖలో స్టాంపుల కొరత:

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖను స్టాంపుల కొరత వేధిస్తోంది. కొన్ని నెలలుగా స్టాంపుల స్టాక్ లేదు. కేవలం స్టాంపుల విక్రయం ద్వారానే ప్రతి నెలా రిజిస్ట్రేషన్ శాఖకు రూ.కోట్లలో ఆదాయం ఉండేది. ప్రస్తుతం స్టాంపులు అందుబాటులో లేకపోవడంతో రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయానికి గండిపడింది.

లైసెన్సు రద్దు చేస్తాం



నిర్ణయించిన ధరకే స్టాంపులు విక్రయించాలి. అధిక ధరకు విక్రయిస్తే స్టాంప్ వెండర్ల లైసెన్సును రద్దు చేస్తాం. అధిక ధరలపై నేరుగా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలి. త్వరలో జిల్లా వ్యాప్తంగా అన్ని కార్యాలయాల్లో స్టాంపులను అందుబాటులో ఉంచుతాం.

– భార్గవ్, జిల్లా రిజిస్ట్రార్

ఈశాన్య రుతుపవనాల ప్రవేశం

- మొదలు కానున్న 'రబీ' ఏరువాక సాగు
- రబీ సాధారణ వర్షపాతం 139.3 మి.మీ

అనంతపురం అగ్రికల్చర్: ఈశాన్య రుతుపవనాలు (నార్త్ ఈస్ట్ మాన్‌సూన్) గురువారం జిల్లాలోకి ప్రవేశించాయి. డిసెంబర్ ఆఖరు వరకు ఈశాన్యంతో వర్షాలు పడాలి. అందులో అక్టోబర్‌లో అత్యధికంగా 100.9 మి.మీ కాగా చలికాలం ప్రారంభమయ్యే నవంబర్‌లో 28.6 మి.మీ, డిసెంబర్‌లో 9.8 మి.మీ... వెరసి రబీ సాధారణ వర్షపాతం 139.3 మి.మీ గా గుర్తించారు. సాధారణంగా నవంబర్, డిసెంబర్‌లో అల్పపీడనాలు, తుఫాన్ల ప్రభావం ఉంటుంది. కాగా ప్రస్తుత అక్టోబర్‌లో ఇప్పటి వరకు పెద్దగా వర్షపాతం నమోదు కాలేదు. 16 రోజలవుతున్నా కేవలం 22.7 మి.మీ నమోదైంది. గురువారం ఈశాన్యం ప్రవేశంతో అనంతపురం, బుక్కరాయసముద్రం, యల్లనూరు, పుట్లూరు, తాడిపత్రి, శింగనమలతో పాటు అక్కడక్కడ మోస్తరుగా వర్షాలు పడటంతో రబీ ఏరువాక ఊపందుకునే పరిస్థితి ఉందని చెబుతున్నారు. ఈ రబీలో 1.08 లక్షల హెక్టార్లలో పంటలు సాగులోకి వస్తాయని అంచనా వేశారు. అందులో ప్రధానపంట కింద పప్పుశెనగ 65 వేల నుంచి 70 వేల హెక్టార్లుగా అంచనా వేశారు. ఖరీఫ్‌తో పోల్చుకుంటే రబీ సాగు తక్కువగానే ఉంటుంది. ప్రధానంగా నల్లరేగడి ప్రాంతాల్లో పప్పుశనగ, ఇక నీటి వసతి కింద వరి, వేరుశనగ, మొక్కజొన్న కొంత వరకు సాగులోకి రావచ్చని చెబుతున్నారు.


అలా ముగిసిన నైరుతి ..

మే 26న జిల్లాను తాకిన నైరుతి రుతుపవనాల (సౌత్‌ఈస్ట్ మాన్‌సూన్) కాలం పూర్తిగా ముగిసింది. ఖరీఫ్ నాలుగు నెలల కాలంలో జూన్ నుంచి సెప్టెంబర్ ఆఖరు వరకు సాధారణ వర్షపాతం 321.5 మి.మీ కాగా అనుకూల వర్షాలతో ఎట్టకేలకు 4.3 శాతం అధికంతో 335.5 మి.మీ వర్షం కురిసింది. ఆగస్టు మినహా మిగతా జూన్, జూలై, సెప్టెంబర్‌లో సాధారణం కన్నా తక్కువగా వర్షాలు పడటంతో ఖరీఫ్‌కు ఇబ్బందిగా తయారైన విషయం తెలిసిందే. తేలికపాటి వర్షాల నడుమ ఖరీఫ్ ఏరువాక మందకొడిగా సాగుతూ 3 లక్షల హెక్టార్లకు చేరుకుంది. పంట దిగుబడులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నట్లు పంట కోత ప్రయోగాలు వెల్లడిచేస్తున్నాయి. ఖరీఫ్ దెబ్బతినడంతో రబీపై రైతులు ఆశలు పెట్టుకుని సాగుకు సిద్ధమవుతున్నారు. జిల్లా వార్షిక వర్షపాతం 512.5 మి.మీ కాగా అందులో ఖరీఫ్‌లో 321.5 మి.మీ, రబీలో 139.3 మి.మీ కాగా జనవరి నుంచి మే వరకు వేసవి కింద 53.7 మి.మీగా గుర్తించారు.

రైలు ఢీకొని వివాహిత మృతి

యాడికి: రైలు ఢీకొని ఓ వివాహిత మృతి చెందింది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. యాడికి మండలం రాయలచెరువు గ్రామానికి చెందిన కురుబ దస్తగిరి, మద్దిలేటమ్మ (40) దంపతులకు పదో తరగతి చదువుతున్న ఓ కుమారుడు ఉన్నాడు. మతి స్థిమితం లేకుండా బాధపడుతున్న మద్దిలేటమ్మ గురువారం ఉదయం దస్తగిరి తోటకు వెళ్లిన సమయంలో నెమ్మదిగా రైలు పట్టాలపై చేరుకుని అటూఇటు తిరుగుతుండగా రైలు ఢీకొంది. ఘటనలో శరీరం ఛిద్రమైంది. సమాచారం అందుకున్న గుత్తి రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

నిర్వాసితులకు న్యాయం చేస్తాం : కలెక్టర్



యర్రగుంటపల్లి వాసులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఓ.ఆనంద్

తాడిపత్రి రూరల్: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములు, స్థలాలు, ఇళ్లను కోల్పోయిన వారికి పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామని కలెక్టర్ ఓ.ఆనంద్ భరోసానిచ్చారు. గురువారం తాడిపత్రి మండలం యర్రగుంటపల్లి, రావివెంకటాంపల్లి, చల్లవారిపల్లి, పులి ప్రొద్దుటూరు గ్రామాల పరిధిలో చేపట్టిన 544డీ జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తమకు పరిహారం పంపిణీలో అన్యాయం జరిగిందంటూ పలుమార్లు రోడ్డు పనులను నిర్వాసితులు అడ్డుకుంటూ వచ్చారు. దీంతో గురువారం కలెక్టర్ ఆయా ప్రాంతాల్లో పర్యటించి నిర్వాసితులతో మాట్లాడారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దార్ సోమశేఖర్, హైవే ఇంజనీర్లు ఉన్నారు.

'తమ్ముడా మజాకా'పై కలెక్టర్ సీరియస్

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడు రూరల్: టీడీపీ అనుబంధ టీఎన్‌టీయూసీ హిందూపురం పార్లమెంట్ అధ్యక్షుడు తాడాల నాగభూషణం మానసిక వికలాంగ కోటాలో అక్రమంగా పింఛన్ పొందుతున్న వైనంపై 'తమ్ముడా మజాకా' శీర్షికన గురువారం 'సాక్షి'లో వెలువడిన కథనంపై అనంతపురం కలెక్టర్ ఓ.ఆనంద్ స్పందించారు. అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో నివాసముంటున్న తాడాల నాగభూషణం పదేళ్లుగా ఈ పింఛన్ పొందుతున్నాడు. ఇప్పటి వరకూ పింఛన్లు పొందుతున్న వందశాతం వైకల్యం ఉన్న వేలాది మంది దివ్యాంగులకు ఇటీవల నోటీసులు జారీ చేసిన కూటమి ప్రభుత్వం ... నాగభూషణం కు ఎలాంటి నోటీసులు ఇవ్వకపోవడం గమనార్హం. ఈ విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తెవడంతో గుర్తించిన కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలో విచారణలో భాగంగా నోటీసు జారీ చేస్తామని ఎంపీడీఓ దివాకర్ పేర్కొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి


మాట్లాడుతున్న ఓబులు

అనంతపురం టౌన్: విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చకుంటే సమ్మె తప్పదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు హెచ్చరించారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై ముద్రించిన కరపత్రాలను గురువారం ఆ శాఖ కార్యాలయాల్లో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు తమ ప్రాణాలను పణంగా పెట్టి పని చేస్తున్నారన్నారు. అలాంటి వారికి అండగా ఉండాల్సిన ప్రభుత్వాలు వివక్ష చూపడమేంటని ప్రశ్నించారు. వారికి న్యాయబద్ధంగా రావాల్సిన డీఏలు, గ్రాట్యూటీ అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం కావడంతోనే వారు సమ్మెకు సిద్ధమయ్యారన్నారు. ఇప్పటికీ చాలా మంది విద్యుత్ కార్మికులు కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేస్తున్నారని తెలిపారు. వారందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటనారాయణ, ముత్తుజా, గోపాల్, మధు, శ్రీనివాసులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఈఈఓగా త్యాగరాజు

అనంతపురం మెడికల్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలోని మాస్ మీడియా విభాగంలో డిప్యూటీ డెమోగా పని చేస్తున్న త్యాగరాజుకు అదే కార్యాలయంలో హెల్త్ ఎడ్యుకేషన్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్(హెచ్ఈఈఓ)గా పదోన్నతి లభించింది. గురువారం పీఓడీటీ డాక్టర్ సురేష్‌బాబు వద్ద ఆయన రిపోర్టు చేసుకున్నారు. ఈ సందర్భంగా త్యాగరాజుకు కింది స్థాయి సిబ్బంది అభినందనలు తెలిపారు.

చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


చెత్త సేకరణపై ఆరా తీస్తున్న జెడ్పీ సీఈఓ శివశంకర్

ఆత్మకూరు: ఇంటింటా చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా పరిషత్ సీఈఓ జి.శివశంకర్ అధికారులను హెచ్చరించారు. గురువారం ఆయన మండలంలోని గొరిదిండ్లలో పర్యటించారు. పంచాయతీ కార్మికులు చెత్తను సేకరిస్తున్నారా... తాగునీరు సక్రమంగా సరఫరా అవుతుందా... అని ఇంటింటికీ వెళ్లి అడిగి తెలుసుకున్నారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పంచాయతీ కార్మికులు వారికి కేటాయించిన ఇళ్లల్లోని తడి, పొడి చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని, అక్కడ వర్మీ కంపోస్ట్‌గా మార్చి రైతులు విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, పంచాయతీ కార్యదర్శి మహబూబ్ బాషా, సర్పంచు నాగరత్నమ్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కుల్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

జంక్ ఫుడ్‌తో ఆరోగ్యానికి ముప్పు


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ జ్యోతి

అనంతపురం రూరల్: జంక్ ఫుడ్ తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. గురువారం సోమనాథ్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మహా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ జ్యోతి మాట్లాడుతూ పిజ్జా, బర్గర్, నూనెలు ఎక్కువగా వాడిన వంటలతో పాటు జంక్ ఫుడ్ తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు ఏర్పడతాయన్నారు. పోషక విలువలు కలిగిన పండ్లు, ఆకుకూరలు, పాలు, గుడ్లు తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. చక్కెర, నూనె, ఉప్పు తగ్గించుకుంటే ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి

అనంతపురం రూరల్: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యం విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి అన్నారు. గురువారం చంద్రబాబునగర్‌లోని అంగన్‌వాడీ-1 కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఝాన్సీరాణి మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటేనే తల్లీబిడ్డా ఆరోగ్యంగా ఉంటారన్నారు. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది అందించే సూచనలు, సలహాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సులు నిల్.. అవస్థలు ఫుల్



బస్సులన్నీ కర్నూలుకు వెళ్లడంతో బోసిపోయిన అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలు, బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

ప్రధానమంత్రి సభ సందర్భంగా ఆర్టీసీ బస్సులను కర్నూలుకు తరలించడంతో ప్రయాణికులకు చుక్కలు కనిపించాయి. గురువారం అనంతపురం ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురు చూసి ప్రయాణికులు అలసిపోయారు. బస్సు ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లోకి ప్రవేశించిందని తెలియగానే అక్కడికే పరుగులు పెట్టారు. తక్కువ సంఖ్యలో ఉన్న బస్సులు ఎక్కేందుకు అవస్థలు పడ్డారు. చంటి పిల్లల తల్లుల కష్టాలు చెప్పనలవిగా మారాయి. ఈ క్రమంలో ప్రభుత్వ తీరుపై పలువురు ప్రయాణికులు తీవ్రంగా మండిపడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం


టికెట్ కొనాల్సి ఉంటుందని తెలిసినా కర్ణాటక బస్సు ఎక్కుతున్న మహిళలు




చాలా సేపు వేచి ఉన్న అనంతరం వచ్చిన బస్సుల్లోకి ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు, చంటి బిడ్డలతో తల్లుల అవస్థలు

నేడు రమా ఏకాదశి వేడుకలు

అనంతపురం కల్చరల్: భవసార క్షత్రియ సంఘం వారి ఆధ్వర్యంలో స్థానిక రామనగర్‌లోని రుక్మిణి పాండురంగస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం రమా ఏకాదశి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి ఆనంద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం అభిషేకాల అనంతరం 11 గంటల వరకు భక్తజన వల్లభుడైన పాండురంగడి నిజరూప స్పర్శ దర్శనం ఏర్పాటు చేశామన్నారు.

టీటీడీలో భగవద్గీత కంఠస్థ పోటీలు

అనంతపురం కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో గీతా జయంతి సందర్భంగా భగవద్గీత పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు గురువారం టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ప్రోగ్రామ్ అసిస్టెంట్ బాబు, పండిట్ వేణు పోటీల వివరాలనందించారు. నవంబర్ 30న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు 6– 9వ తరగతుల విద్యార్థులకు భగవద్గీతలోని 14వ అధ్యాయమైన గుణత్రయ విభాగయోగం, 10వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకు 16వ అధ్యాయమైన దైవాసుర సంపద్ విభాగయోగంపై కంఠస్థ పోటీలుంటాయన్నారు. 18 ఏళ్లు పైబడిన వారికి 'నిత్య జీవితంలో భగవద్గీత భావ విశ్లేషణ' అనే అంశంపై పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి విభాగంలో బహుమతులుంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9292325020 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నిబద్ధతతో పని చేస్తే సముచిత స్థానం

- గ్రామ, డివిజన్ స్థాయిలో అనుబంధ సంఘాల కమిటీల ఏర్పాటు
- డివిజన్ స్థాయిలో 'కోటి సంతకాల సేకరణ' పక్కాగా జరగాలి
- వైఎస్సార్ సీపీ అనంతపురం అర్బన్ సమన్వయకర్త అనంత వెంకట్రామి రెడ్డి


మాట్లాడుతున్న అనంతపురం అసెంబ్లీ సమన్వయకర్త అనంత వెంకట్రామి రెడ్డి

అనంతపురం: 'పార్టీ పట్ల అంకితభావం, నిబద్ధతతో ఉన్న వారే నాయకులు. అలాంటి వారికి పార్టీలో సముచితస్థానం కల్పిద్దాం. వచ్చే ప్రభుత్వం మనదే.. కేవలం పొలిటికల్ గవర్నెన్స్ మాత్రమే ఉంటుంది. ఈ నేపథ్యంలో పార్టీని అధికారంలోకి తేవడానికి క్షేత్రస్థాయి నుంచే సన్నద్ధం కావాలి' అని వైఎస్సార్ సీపీ అనంతపురం నియోజకవర్గ సమన్వయకర్త, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామి రెడ్డి అన్నారు. క్షేత్రస్థాయిలో నిఖార్సైన నాయకులను తయారు చేయడానికి డివిజన్ స్థాయిలో కమిటీల నియామకం చేపడుతున్నట్లు వివరించారు. గురువారం నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న క్యాంప్ కార్యాలయంలో కార్పొరేటర్లు, పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని నాలుగు పంచాయతీలు, 50 డివిజన్ల పరిధిలో కొత్తగా కమిటీలను నవంబర్ 16వ తేదీలోపు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి డివిజన్‌కు ఒక అధ్యక్షుడు, నలుగురు ప్రధాన కార్యదర్శులు, నలుగురు కార్యదర్శులు, ఆరుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఉంటారని చెప్పారు. అనుబంధ సంఘాలకు సంబంధించి యువజన, మహిళ, విద్యార్థి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విభాగాలను కూడా పూర్తి చేయాలన్నారు. సోషల్ మీడియాకు సంబంధించి డివిజన్‌కు ఒకరిద్దరిని ఎంపిక చేయాలన్నారు. కమిటీలు వేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, గ్రామ, డివిజన్ స్థాయిల్లో సైన్యంలా పని చేసేలా ఉండాలని స్పష్టం చేశారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి..

స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చిలో ఉంటాయని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. పార్టీని బలోపేతం చేస్తూనే ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. గత ఎన్నికల్లో ఓడిపోయినా ఎవరూ ఆత్మస్థైర్యం కోల్పోలేదని, మనకు అధికారమే పరమావధి కాదని తెలిపారు. కూటమి ప్రభుత్వం పోలీస్, రెవెన్యూ వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని అక్రమ కేసులు పెడుతున్నా ఎవరూ భయపడడం లేదన్నారు. ఏడాదిన్నరగా చంద్రబాబు, అధికార పార్టీ నేతలు ప్రచారానికే పరిమితమవుతున్నారని దుయ్యబట్టారు. వాస్తవాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా డివిజన్, పంచాయతీ స్థాయిలో 'కోటి సంతకాల సేకరణ' చేపట్టాలని సూచించారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్న సమయంలో విద్య, వైద్యానికి పెద్దపీట వేసిన విషయాన్ని గుర్తు చేశారు. కోవిడ్ వంటి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు అందించామని తెలిపారు. పేదలకు మెరుగైన వైద్యంతో పాటు వైద్య విద్యను అందుబాటులోకి తేవడం కోసం రూ.8 వేల కోట్లతో ప్రతి జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 2019 వరకు కేవలం 11 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఉన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. వైఎస్ జగన్ పాలనలో కొత్తగా 17 కళాశాలలను తీసుకొచ్చి, అప్పట్లోనే ఐదు కళాశాలల్లో తరగతులు ప్రారంభించామన్నారు. కానీ కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేస్తోందని మండిపడ్డారు. డివిజన్, పంచాయతీల్లో ప్రతి ఇంటికీ వెళ్లి సంతకాల సేకరణ చేపట్టాలన్నారు. ఈనెల 28న నియోజకవర్గ స్థాయిలో, నవంబర్ 12వ తేదీన జిల్లా స్థాయిలో ర్యాలీలు ఉంటాయని తెలిపారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి


టీచర్లకు సూచనలిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం సిటీ: చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదంటూ డీఈఓ ప్రసాద్‌బాబు స్పష్టం చేశారు. అనంతపురం కోర్టు రోడ్డులోని నెహ్రూ మున్సిపల్ స్కూల్, నాల్గో రోడ్డులోని జయప్రకాశ్‌నారాయణ స్కూల్, పాపంపేటలోని ఉన్నత పాఠశాలలను డీఈఓ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. వివిధ పాఠ్యాంశాలకు సంబంధించి విద్యార్థులకు ఎంత మాత్రం అవగాహన ఉందనే విషయ సామర్థ్యాలను పరిశీలించారు. కొందరు సంతృప్తికర సమాధానాలు ఇవ్వగా, మరి కొందరు చెప్పలేకపోయారు. దీంతో ఉపాధ్యాయులను డీఈఓ ప్రశ్నించారు. ప్రతి విద్యార్థిపైనా ఉపాధ్యాయులు శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. పరీక్షల సమయానికి పూర్తి స్థాయిలో చదువులో రాటుదేలేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి మెనూ పరిశీలించారు. కోడిగుడ్లు చిన్నవి సరఫరా చేస్తే వెనక్కి పంపాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. మెనూ పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్‌ఎంలను హెచ్చరించారు.

అన్ని వర్గాలకూ చంద్రబాబు మోసం


సోములదొడ్డిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత అన్ని వర్గాలకూ మోసం చేశారని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గురువారం అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి, కందుకూరు గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాలుగుసార్లు సీఎంగా పని చేసినా ఒక ఆస్పత్రి కాని, మెడికల్ కళాశాల కానీ తీసుకురాలేదన్నారు. వైఎస్ జగనన్న ఒకే మారు 17 ప్రభుత్వ కళాశాలలు తీసుకొచ్చారన్నారు. ఇలాంటి కళాశాలలను చంద్రబాబు ప్రైవేట్ వారికి అప్పగించారన్నారు. ప్రైవేట్‌వారు డబ్బులు లేకుండా సూది వేస్తారా? అని ప్రశ్నించారు. పేదలకు ఉచిత వైద్యం అందాలంటే ప్రభుత్వ మెడికల్ కళాశాలలు రావాలన్నారు. కోటి సంతకాలు చేసి గవర్నరుకు వినతిపత్రం అందజేస్తామన్నారు. ఉద్యోగాలిస్తామంటూ యువతను, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యార్థులను, 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తామని చెప్పి ఇవ్వకుండా ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనార్టీ ప్రజలను, నెలకు రూ. 1,500 ఇస్తామని చెప్పి మహిళలను మోసగించారన్నారు. గ్రామంలో 10 మందికి పింఛన్లు వస్తుంటే ముగ్గురికి తొలిగించి ఏడుగురికి మాత్రమే ఇస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో అర్హులైన అందరికీ పింఛన్లు వచ్చాయన్నారు. పరిటాల సునీతమ్మ, వారి బంధువులు తప్ప తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేసిన వారు కూడా బాధపడుతున్నారన్నారు. గ్రామ కమిటీలే కీలకంగా పని చేయాలన్నారు. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత పథకాలన్నీ గ్రామ కమిటీల ఆధ్వర్యంలో అమలు చేస్తామన్నారు.

ఎన్–బ్రాండ్ మద్యం తాగొద్దు..

రాష్ట్రంలో ఎన్–బ్రాండ్, కల్తీ మద్యం ఏరులై పారుతోందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కేవలం స్పిరిట్, నీళ్లు, రంగుపొడి కలిపి బాటిళ్లలో నింపుతున్నారన్నారు. ఇది తాగితే లివర్, పేగులు చెడిపోతాయన్నారు. దయచేసి ఎన్–బ్రాండ్ మద్యం తాగొద్దన్నారు. మందు మాని కుటుంబాలు కాపాడుకోవాలన్నారు. గ్రామాల్లో కమిటీలను బలోపేతం చేయాలన్నారు. అన్ని గ్రామాల్లోనూ కమిటీలను వెంటనే నియమించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, మండల కన్వీనర్లు బండి పవన్, దుగుమర్రి గోవిందరెడ్డి, సర్పంచ్‌లు ప్రశాంత్‌కుమార్, కృష్ణారెడ్డి, గురుప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు రాగే రేవతిపెద్దప్ప, శారదా కొండారెడ్డి, ఉప సర్పంచ్ ఓబులేసు, నాయకులు ఈశ్వరయ్య, నాగార్జునరెడ్డి, ఓబిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, నాగరాజు, సుదర్శన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వడ్డే బాల, కురవ రాము, దేవ ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, లింగమయ్య, నారాయణస్వామి, నరసింహారెడ్డి, గోవర్దన్, శేఖర్‌రెడ్డి, సుధీర్, జయచంద్రారెడ్డి, రాము, బాలకృష్ణ పాల్గొన్నారు.

అటకెక్కిన ఫాగింగ్

- నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యం
- డివిజన్లలో దోమల స్వైర విహారం
- విష జ్వరాలతో నగరవాసుల సతమతం



అనంతపురం క్రైం: అనంతపురం నగరంలోని 50 డివిజన్లలో ఫాగింగ్ ఆచరణలో కనిపించడం లేదు. ఈ క్రమంలో దోమల బెడద పెరిగి మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు ప్రజల్ని చుట్టుముట్టాయి. దీంతో నగరవాసులు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. చిన్నపాటి వర్షాలకే నగరం చిత్తడిగా మారుతోంది. డ్రైనేజీలు దారుణంగా ఉండటంతో ప్రజలు ముక్కుమూసుకుని జీవనం సాగించాల్సి వస్తోంది. ఈ క్రమంలో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. విష జ్వరాలు ప్రబలి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి రోగులు క్యూ కడుతున్నారు. ఆస్పత్రికి రోజువారి వస్తున్న రోగుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే 3 వేల మందికి తక్కువ ఉండడం లేదు. విష జ్వరాలు, మలేరియా బాధితుల్లో వెయ్యి మందికి తగ్గకుండా నగరానికి చెందిన వారు ఉంటున్నారని వైద్య సిబ్బంది చెబుతున్నారు.

ఫాగింగ్ ఎక్కడ..?

ప్రతి డివిజన్‌లో వారం రోజులకోసారి ఫాగింగ్ చేయాలన్న నియమాన్ని నగరపాలక సంస్థ అధికారులు పూర్తిగా విస్మరించారు. 15 రోజులకోసారి చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆ విభాగం అధికారులు చెబుతున్నా అదీలేదు. కొన్ని నెలలుగా ఫాగింగ్ యంత్రాలు కార్యాలయంలోని గదులకే పరిమితమైనట్లు తెలిసింది. దీంతో నగరంలోని కాలనీల్లో దోమలు రాజ్యమేలుతూ రాత్రి పగలు లేకుండా ప్రజలపై దాడి చేస్తున్నాయి. "మున్సిపల్ సిబ్బంది పన్నులు వసూలు చేసేందుకు మాత్రమే వస్తారు కానీ, ఆరోగ్యాలపై శ్రద్ధ పెట్టడం లేదంటూ నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

'మూగ'బోయిన మలేరియా విభాగం..

ప్రజారోగ్య పరిరక్షణే నగరపాలక మలేరియా విభాగం ప్రధాన బాధ్యత. కాగా ఈ విభాగంలో ఎక్కడా రికార్డుల నిర్వహణ సరిగా లేదు. ఎంత మంది సిబ్బంది విధుల్లో ఉన్నారు.. ఎంత మంది రోజువారీ పనులు చక్కబెడుతున్నారన్న వివరాలే కానరావడం లేదు. ఇంతకీ ఈ విభాగం పనిచేస్తోందా.. లేదా అన్నది కూడా సందేహంగా మారింది. డివిజన్ వారీగా సిబ్బందిని కేటాయించినా క్షేత్రస్థాయిలో వారి జాడ కనిపించడం లేదు. ఈ క్రమంలో ప్రజల ఆరోగ్య భద్రతపై కాకుండా, ఆదాయం మార్గాలపై కూటమి ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టెండర్లు, బిల్లులు, కాంట్రాక్టులు, కమీషన్ల మీద చర్చించుకోవడానికే కాలం సరిపోతోందని బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలు రోగాల బారిన పడి మంచం పట్టినా ఆదాయమే పరమావధిగా పాలకులు వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణపై అధికారులు, పాలకుల నుంచి కనీస స్పందన లేకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

హెచ్‌ఎం లలితమ్మ కన్నుమూత


లలితమ్మ (ఫైల్)

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం విద్యారణ్య నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.లలితమ్మ (60) ఆకస్మికంగా మృతి చెందారు. ఆరు రోజుల కిందట అనంతపురం నగరంలో భర్తతో కలిసి బైకులో వెళ్తుండగా అదుపుతప్పి ఆమె కింద పడ్డారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన నగర శివారులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరు రామయ్య ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో తలకు సర్జరీ చేశారు. కోలుకుంటుందని భావిస్తున్న తరుణంలో పరిస్థితి చేజారి గురువారం ఉదయం 9.30 గంటల సమయంలో కన్నుమూశారు. ఈమె భర్త రామమూర్తి టెలికం డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తూ రిటైర్డ్ అయ్యారు. లలితమ్మ మృతి విన్న చాలామంది షాక్‌కు గురయ్యారు. కణేకల్లు మండలం యర్రగుంట జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎంగా పని చేస్తున్న ఈమె ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో విద్యారణ్యనగర్ జెడ్పీహెచ్ఎస్‌కు వచ్చారు. కాగా లలితమ్మ దంపతులకు పిల్లలు లేరు. బుద్ధిమాంద్యం పిల్లాడిని దత్తత తీసుకున్నారు. స్కూల్‌లో పిల్లలను లలితమ్మ ఇష్టంగా చూసుకునేవారు. తమ ఇష్టమైన టీచరు మృతిని జీర్ణించుకోలేని పిల్లలు కన్నీటిపర్యంతమయ్యారు.

మట్టిరోడ్డు నిర్మాణానికి హామీ

రాప్తాడు: తమ పొలాలకు వెళ్లేందుకు రోడ్డులేక ఇబ్బంది పడుతున్న బుక్కచెర్ల గ్రామానికి చెందిన రైతులకు ఎంపీడీఓ విజయలక్ష్మి భరోసా ఇచ్చారు. వీలైనంత త్వరలోనే మట్టిరోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. పొలాలకు వెళ్లేందుకు రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని బుక్కచెర్ల గ్రామానికి చెందిన పలువురు రైతులు ఈనెల 13వ తేదీ ప్రజా పరిష్కార వేదికలో ఎంపీడీఓకు వినతి పత్రం ఇచ్చారు. స్పందించిన ఆమె గురువారం గ్రామంలో పర్యటించారు. పొలాలకు వెళ్లే రోడ్డును పరిశీలించారు. ఉపాధి హామీ పథకం నిధులతో 3 కిలోమీటర్ల మేర మట్టిరోడ్డును త్వరలో వేయిస్తానని హామీ ఇచ్చారు. వెంటనే ఎస్టిమేషన్ వేయాలని ఏపీఓ సావిత్రిని ఆదేశించారు. అనంతరం గ్రామంలో నూతనంగా వేసిన బీటీ రోడ్డుతో పాటు గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న పశువుల షెడ్డను పరిశీలించారు. కార్యక్రమంలో ఈసీ మురళి, ఫీల్డ్ అసిస్టెంట్ ఓబులేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శస్త్రచికిత్సల్లో అనస్తీషియా కీలకం

అనంతపురం మెడికల్: శస్త్రచికిత్స, నొప్పి నివారణలో అనస్తీషియా పాత్ర ఎంతో కీలకమని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయశ్రీ, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎల్ సుబ్రమణ్యం అన్నారు. గురువారం ప్రపంచ అనస్తీషియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని వైద్యకళాశాల వద్ద ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ జెండా ఊపి ప్రారంభించారు. అక్కడి నుంచి జెడ్పీ, తిరిగి అక్కడి నుంచి వైద్య కళాశాల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1846 అక్టోబర్ 16న బోస్టన్‌లోని మసాచుసెట్స్ ఆస్పత్రిలో ఈథర్ అనే రసాయన పదార్థాన్ని శస్త్రచికిత్స సమయంలో నొప్పిని నివారించడానికి ఉపయోగించారన్నారు. కార్యక్రమంలో అనస్తీషియా విభాగాధిపతి డాక్టర్ నవీన్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ మధుసూదన్, డాక్టర్ శ్రీహరిబాబు, ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ లలిత భవాని, డాక్టర్ సుమన గోపీచంద్ పాల్గొన్నారు.

ఆడపిల్లలను ప్రోత్సహించాలి

రాప్తాడు: ఆడపిల్లలపై వివక్ష చూపకుండా అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని రాప్తాడు పీహెచ్‌సీ సీహెచ్ఓ శివప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలోని కేజీబీవీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆడపిల్లలను బాగా చదివిస్తే అద్భుతాలు చేయగలరన్నారు. ప్రస్తుతం ఆడపిల్లల సంఖ్య క్షీణించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత మాట్లాడుతూ... బాల్య వివాహాలను పూర్తిగా నివారించాలన్నారు. ఎస్ఓ ముత్యాలమ్మ, ఎంపీహెచ్ఎస్ అరుణ పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవనశైలిని అలవరచుకోవాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రొఫెసర్ అనిత

అనంతపురం సిటీ: ఆరోగ్యకర జీవనశైలిని అలవరచుకోవాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగం ప్రొఫెసర్, మైక్రోబయాలజీ హెడ్ డా.ఎస్. అనిత అన్నారు. అనంతపురంలోని ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం ప్రపంచ ఆహార దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి డా.అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ధ్యానం ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలని పేర్కొన్నారు. చదువుతో పాటు వ్యాయామానికి ప్రాధాన్యం ఇవ్వాలని కళాశాల వైస్ చైర్మన్ చక్రధర్‌రెడ్డి కోరారు. చిన్నప్పటి నుంచే క్రమబద్ధమైన ఆహార నియమాలు పాటించాలని, అప్పుడే చదువులో రాణించడంతో పాటు ఆరోగ్యపరంగానూ ఆనందంగా ఉండొచ్చని కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్‌పీవీ ప్రసాద్ తెలిపారు. బయోటెక్నాలజీ విభాగాధిపతి డా.ఎస్.రిజ్వాన, ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి సాయి ప్రీతి, విద్యార్థులు పాల్గొన్నారు.

యువర్స్

● వికాసం



నిరుద్యోగిగా ఉన్నా సరే...

కొద్దిమందిలో ఉండే అపోహ్...

'కష్టపడుతున్నప్పుడే ఒత్తిడికి గురవుతాం'

అసలు విషయం ఏమిటంటే, కష్టపడుతున్నప్పుడే కాదు పనిచేయకుండా, ఏమీ పట్టకుండా ఉన్నప్పుడు కూడా ఒత్తిడికి గురవుతాము. మనం ఏదైనా విషయానికి సంబంధించి తరచుగా ఒత్తిడికి గురవుతుంటే 'అదంతేలే' అని అనుకోవడానికి లేదు. 'ఎందుకు ఇలా జరుగుతుంది?' అని విశ్లేషించుకుంటే ఒక పరిష్కార మార్గం తప్పనిసరిగా కనిపిస్తుంది.

ఒత్తిడిగా అనిపించినప్పుడు ఎవరికైనా చిన్న ఫోన్ కాల్ చేయండి, లేదా ఇమెయిల్ పంపించండి. చిన్న పని అయినా సరే, అది మీ ఒత్తిడిని తగ్గించడంలో కీలకం అవుతుంది.

నిరుద్యోగిగా ఉన్నా సరే క్రమశిక్షణకు దూరం కాకూడదు. ఎప్పుడూ ఏదో ఒకటి నేర్చుకుంటూనే ఉండాలి. ఒకటి కాకుంటే మరొకటి ఇంటర్వ్యూలకు హాజరవుతూనే ఉండాలి.

– **జెఫ్ బెజోస్**, ఫౌండర్, అమెజాన్

● ఆర్ట్ అండ్ కల్చర్





బొమ్మల కళ

బొమ్మలు మాట్లాడవు. తమ గురించి మాట్లాడేలా చేస్తాయి. అలా మాట్లాడాలంటే ఆర్టిస్ట్‌లో అద్భుత సృజన ఉండాలి. అలాంటి ఒక ఆర్టిస్ట్ ఆమదాలవలసకు చెందిన ప్రియాంక. శుభకార్యాలకు తగ్గట్టు రకరకాల థీమ్స్‌తో బొమ్మల సిరీస్ రూపొందిస్తూ పాతకళకు కొత్త కళ తీసుకువస్తోంది ప్రియాంక...

'చిన్నప్పుడు ఆడుకున్న ఆటల్లో బొమ్మలే నా బతుకు బండిని నడిపిస్తాయని నేను అసలు ఊహించనే లేదు' అంటుంది ప్రియాంక. బొమ్మల ద్వారా నేటి తరానికి సంప్రదాయ విలువలను వివరించడంలో ఆనందం ఉందంటారు ఆమె. తన మనసులో మెదిలిన ఊహకు సృజనాత్మకంగా ప్రాణం పోస్తూ, బొమ్మలను థీమ్‌కు తగ్గట్టు రూపొందిస్తూ వినియోగదారుల మనసు గెలుచుకుంటుంది ప్రియాంక. ఆ బొమ్మలు సనాతన సంప్రదాయాలకు ప్రతీకలుగా కనిపిస్తాయి. కనుమరుగవుతున్న కళలు కళ్ల ముందు కనబడతాయి.

అనుబంధాల రైలుబండి

కాంక్రీట్ జంగిల్‌లో న్యూక్లియర్ ఫ్యామిలీల నడుమ దూరమవుతున్న అనుబంధాలు ప్రియాంక తయారుచేసే బొమ్మలతో గుర్తుకు వస్తాయి. ఆమదాలవలసకు చెందిన ఒక పెద్దాయన 60వ పుట్టిన రోజు వేడుకను భిన్నంగా చేయాలని కుటుంబ సభ్యులు ఆలోచించారు. ప్రియాంకకు విషయాన్ని వివరించారు. అరవై ఏళ్లలో జరిగిన ఘట్టాలను అద్భుతమైన రీతిలో బొమ్మల రూపంలో కళ్లకు కట్టేలా తీర్చిదిద్దింది ప్రియాంక. అన్నప్రాసన వేడుక నుంచి పదవీ విరమణ వేడుక వరకు... ఆ పెద్దాయన జీవితంలోని వివిధ దశలను చిన్న రైలు బండి మాదిరిగా బొమ్మల్లో తయారు చేసి శభాష్ అనిపించుకుంది.

తాళికట్టు శుభవేళ

పలాసకు చెందిన ఒక వ్యాపారి నూతన గృహ ప్రవేశ వేడుకను భిన్నంగా చేయాలనుకున్నాడు. కాన్సెప్ట్‌ను వివరించాడు. బిల్డింగ్ నమూనా నుంచి సత్యనారాయణ వ్రతం, గో మాత ప్రవేశంతో సహా అన్నింటిని చక్కని బొమ్మలతో కళ్లకు కట్టింది ప్రియాంక. శుభకార్యానికి వచ్చిన అతిథులంతా ఈ థీమ్‌ను చూసి భలే ముచ్చటపడ్డారు.

శ్రీకాకుళం నగరంలోని ఒక కార్పొరేట్ బ్యాంక్‌లో నవరాత్రి పూజలు నిర్వహించాలని బ్యాంక్ సిబ్బంది భావించారు. రెండు రోజులు కష్టపడి నవరాత్రి వేడుకల థీమ్‌ను తయారు చేసి బ్యాంక్‌ను లక్ష్మీనిలయంగా మార్చింది ప్రియాంక. వివాహ వేడుకకు ప్రారంభ ఘట్టమైన గోధుమరాయి కార్యక్రమం నుంచి తాళికట్టు శుభవేళ వరకు తయారు చేసిన వెడ్డింగ్ సెట్ ప్రియాంక స్పెషల్. ఆ సెట్ చూస్తే మన కళ్ల ముందే పెళ్లి జరిగినంత సంబరం మన సొంతం అవుతుంది.

– దువ్వూరి గోపాలరావు,
సాక్షి, శ్రీకాకుళం
ఫొటోలు:
జయశంకర్ కుప్పిలి

ఇదే నా ప్రపంచం

చిన్నప్పుడే కాదు పెద్దయ్యాక కూడా బొమ్మలను వదల్లేదు. అమ్మ సాయంతో వాటిని చక్కగా అలంకరించడం చిన్నప్పటి నుంచి నా అలవాటు. డిగ్రీ పూర్తయింది. ఉపాధి కోసం ఏదో ఒకటి చేయాలి అనుకున్నాను. బొమ్మలతోనే కొత్తగా ఏదైనా చేయాలనుకున్నాను. బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను. నా ఆలోచనలను నాన్నతో పంచుకున్నాను. ఆయన ప్రోత్సహించారు. వర్క్‌షాపులో కొంత భాగం నన్ను వినియోగించుకోమన్నారు. ఆర్టిస్టిక్‌గా ఫోరూమ్‌ను సిద్ధం చేశారు. విభిన్న రకాల థీమ్‌లను సిద్ధం చేశాను. సోషల్ మీడియా వేదికగా నేను తయారుచేసిన బొమ్మలను, ఫొటోలను షేర్ చేయడం మొదలుపెట్టాను. ఆర్డర్లు పెరిగాయి. బొమ్మల ద్వారా సంప్రదాయాల్ని వివరిస్తున్నందుకు ఆనందంగా ఉంది.

- ప్రియాంక

● టెక్... టాక్

జీవం ఉట్టిపడే ఇమేజ్ జనరేషన్‌తో జెమిని 'నానో బనానా మోడల్' పాపులర్ అయింది. నానో బనానా ఏఐ మోడల్‌ను ప్రారంభించినప్పటి నుంచి 500 మిలియన్‌లకు పైగా ఇమేజ్‌లకు ఉపయోగించబడింది. తాజాగా... జెమిని యాప్స్ నుంచి సెర్చ్ అండ్ లెన్స్‌కు నానో బనానా మోడల్‌ను విస్తరించారు. ఇమేజ్‌లు జనరేట్ చేయడానికి, ఎడిట్ చేయడానికి నానో బనానాను ఏఐ మోడ్, గూగుల్ లెన్స్‌తో అనుసంధానించారు. దీనివల్ల యూజర్‌లు గూగుల్ ఎకోసిస్టమ్ దాటకుండానే అడ్వాన్స్‌డ్ ఏఐ ఇమేజ్ ఎడిటింగ్ అండ్ క్రియేషన్ టూల్స్‌తో యాక్సెస్ కావచ్చు. గూగుల్ సెర్చ్ ఏఐ మోడల్‌లో ప్రాంప్ట్ బాక్స్ దిగువన ఎడమవైపు కొత్త ప్లస్ ఐకాన్ కనిపిస్తుంది. ఈ ఐకాన్‌ను నొక్కితే కొత్త గ్యాలరీ, కెమెరా, క్రియేట్ ఇమేజ్‌లాంటి కొత్త క్రియేటివ్ ఆప్షన్స్ కనిపిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న యూజర్‌లకు ఈ ఇంటిగ్రేషన్ అందుబాటులో ఉందా లేదా అనే విషయంలో స్పష్టత లేదు.



● ఏఐ ఏరియా

మాయి-ఇమేజ్-1




ఈ సంవత్సరం ప్రారంభం నుంచి మైక్రోసాఫ్ట్ ఏఐ(మాయి) ఇన్-హౌజ్ జనరేటివ్ మోడల్స్‌ను అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టింది. గత ఆగస్ట్‌లో స్పీచ్ జనరేషన్ మోడల్ మాయి-వాయిస్-1 లాంచ్ చేసింది.

తాజాగా తమ మొట్టమొదటి మాయి-ఇమేజ్-1ను ఆవిష్కరించింది.

ఇది 10 టెక్స్ట్-టు-ఇమేజ్ జాబితాలో చోటు సాధించడం విశేషం.

జనరల్ పర్పస్ ఏఐ మోడల్స్‌లా కాకుండా 'మాయి-ఇమేజ్-1'ను 'పర్పస్-బిల్ట్' మోడల్‌గా తీర్చిదిద్దారు. ప్రాక్టికల్, రియల్ వరల్డ్ క్రియేటివ్ టాస్క్‌లకు ఈ మోడల్ బాగా ఉపయోగపడుతుందని కంపెనీ తెలియజేసింది. ఈ మోడల్‌కు సంబంధించి సాంకేతిక విషయాలను వివరంగా వెల్లడించనప్పటికీ లైటింగ్, ప్రకృతి దృశ్యాలు, ఇతర సృజనాత్మక దృశ్యాలతో సహా ఫోటోరియలిస్టిక్ చిత్రాలను రూపొందించడంలో ఈ మోడల్ బలాన్ని కంపెనీ హైలైట్ చేసింది.

ఇతర మోడల్స్‌తో పోల్చితే 'మాయి-ఇమేజ్-1' చాలా త్వరగా రిజల్ట్‌ను చూపిస్తుందని, వేగం, నాణ్యత మధ్య బ్యాలెన్స్ చూపిస్తుందని తెలియజేసింది మైక్రోసాఫ్ట్.



విన్ బై ఏ నోస్

చాలా తక్కువ తేడాతో విజయం సాధించడానికి సంబంధించి వాడే మాట... విన్ బై ఏ నోస్
ఉదా: శ్రావణి వోన్ ది రేస్, బట్ షీ వోన్లీ వోన్ బై ఏ నోస్

వెల్ అప్ ఇన్ ఇయర్స్

'వయసు పైబడిన' 'పాత' అనేదానికి సంబంధించి వాడే మాట... వెల్ అప్ ఇన్ ఇయర్స్
ఉదా: జాన్స్ వెల్ అప్ ఇన్ ఇయర్స్ బట్ హెల్తీ

ఇట్ ఈజ్ ఏ లాంగ్ లేన్ దట్ హ్యాజ్ నో టర్నింగ్

'కష్టాలు శాశ్వతం కాదు' అనే చెప్పే సందర్భంలో ఉపయోగించే మాట... ఇట్ ఈజ్ ఏ లాంగ్ లేన్ దట్ హ్యాజ్ నో టర్నింగ్. **ఉదా:** బట్ ఇట్ ఈజ్ ఏ లాంగ్ లేన్ దట్ హ్యాజ్ నో టర్నింగ్. ఐయామ్ ష్యూర్ థింగ్స్ విల్ చేంజ్ సూన్

శాంసంగ్ గెలాక్సీ ట్యాబ్ ఎస్ 11



డిస్‌ప్లే:	14.60 అంగుళాలు
రిఫ్రెష్ రేట్:	120 హెచ్‌జడ్
రిజల్యూషన్:	1848×2960 పిక్సెల్స్
మెమోరీ:	128జీబి 12జీబి ర్యామ్/ 256జీబి 12జీబి ర్యామ్/ 512 జీబి 12జీబి ర్యామ్
ఫ్రంట్ కెమెరా:	12 ఎంపీ
బ్యాటరీ:	11600 ఎంఏహెచ్

హెచ్‌ఎండీ టచ్ 4జీ



సైజ్:	3.2 అంగుళాలు
రిజల్యూషన్:	240×320 పిక్సెల్స్
బరువు:	100 గ్రా.
కలర్స్:	డార్క్ బ్లూ, సియాన్
ఇంటర్నల్:	64 ఎంబీ 128 ఎంబీ ర్యామ్

వన్‌ప్లస్ పాడ్ లైట్



డిస్‌ప్లే:	11.00 అంగుళాలు
ఫ్రంట్ కెమెరా:	5 ఎంపీ,
రిజల్యూషన్:	1920× 1200 పిక్సెల్స్
ర్యామ్:	6జీబి
ఇంటర్నల్ స్టోరేజ్:	128జీబి
బ్యాటరీ:	9340 ఎంఏహెచ్
బరువు:	530 గ్రా.

సాక్షి సినిమా

ముచ్చటగా మూడోసారి!



● నెల్సన్, రజనీకాంత్

హీరో రజనీకాంత్, డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్‌లది హిట్ కాంబినేషన్. వీరి కాంబోలో వచ్చిన తొలి చిత్రం 'జైలర్' 2023 ఆగస్టు 10న విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. తాజాగా వీరిద్దరి కలయికలో 'జైలర్ 2' సినిమా రూపొందుతోన్న సంగతి తెలిసిందే. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. 'జైలర్' సూపర్ హిట్ కావడంతో 'జైలర్ 2' సినిమాపై ఇటు ఇండస్ట్రీలో అటు ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. 2026 జూన్‌లో 'జైలర్ 2' విడుదల కానుంది. ఇదిలా ఉంటే... రజనీకాంత్-నెల్సన్ దిలీప్ కుమార్ కాంబినేషన్ ముచ్చటగా మూడోసారి రిపీట్ కానుందని కోలీవుడ్ టాక్. ఇప్పటికే 'జైలర్ 2' చిత్రీకరణ సుమారు 70 శాతం పూర్తయిందట. ఈ సినిమా తర్వాత మరోసారి రజనీకాంత్‌తో ఓ మూవీ కోసం నెల్సన్ దిలీప్ స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నారని టాక్. ఈ స్టోరీ లైన్‌ని ఇటీవల రజనీకాంత్‌కి వినిపించగా ఆయన కూడా పచ్చజెండా ఊపారట. మరి... రజనీ-నెల్సన్ కాంబినేషన్‌లో మూడో చిత్రం ఉంటుందా? అనే విషయం తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాలి.

తిలక్ వర్మ ప్రతిభ అసాధారణం

- చిరంజీవి



● సుస్మిత, తిలక్ వర్మ, చిరంజీవి, అనిల్ రావిపూడి

ఇటీవల జరిగిన ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై భారత్ ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన యువ క్రికెటర్ తిలక్ వర్మను హీరో చిరంజీవి సన్మానించారు. చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా, కేథరిన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సెట్స్‌కి ఇటీవల తిలక్ వర్మని ఆహ్వానించి, యూనిట్ సమక్షంలో సన్మానించారు చిరంజీవి. ''ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్‌లో భారత్- పాకిస్థాన్ తలపడ్డాయి. ఎంతో ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆడుతూ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో భారత్ విజయంలో కీలక భాగస్వామి అయిన తిలక్ వర్మ ప్రతిభ అసాధారణం. కృషి, క్రమశిక్షణ అన్నది కేవలం క్రీడల్లోనే కాకుండా జీవితంలోనూ విజయానికి మార్గదర్శకం'' అని చిరంజీవి చెప్పారు.

కాంబినేషన్ సెట్?



● విజయ్ దేవరకొండ

హీరో విజయ్ దేవరకొండ-డైరెక్టర్ విక్రమ్ కె. కుమార్ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనుందా? అంటే అవుననే వార్తలు వినిపిస్తున్నాయి. విజయ్ దేవరకొండ ప్రస్తుతం రెండు సినిమాలతో బిజీగా ఉన్నారు. తనకు 'టాక్సీవాలా' (2018) వంటి హిట్ మూవీ అందించిన దర్శకుడు రాహుల్ సంకృత్యాన్‌తో రెండో సినిమా చేస్తున్నారు విజయ్. మరోవైపు 'రాజావారు రాణిగారు' చిత్రదర్శకుడు రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. ఈ రెండు చిత్రాల తర్వాత డైరెక్టర్ విక్రమ్ కె. కుమార్‌తో విజయ్ దేవరకొండ ఓ సినిమా చేయనున్నారని టాక్. 'ఇష్క్, మనం, హలో, నానీస్ గ్యాంగ్‌లీడర్' వంటి పలు చిత్రాలను తెరకెక్కించి, తెలుగు ప్రేక్షకుల్లో తనకంటూ ఓ గుర్తింపు సొంతం చేసుకున్నారు విక్రమ్ కె. కుమార్. ఇక ఆ మధ్యలో నితిన్ హీరోగా ఓ సినిమా తెరకెక్కిస్తారనే వార్తలు వచ్చినప్పటికీ ఎలాంటి ప్రకటన లేదు. అయితే తన తాజా చిత్రాన్ని విజయ్‌తో చేయనున్నారట విక్రమ్. ఇందుకోసం కథ సిద్ధం చేసే పనిలో ఉన్నారట. మరి... ఈ కాంబినేషన్ సెట్ అవుతుందా? వేచి చూడాల్సిందే.



● విక్రమ్ కె. కుమార్

కచ్చితంగా నచ్చుతుంది డ్యూడ్

- ప్రదీప్ రంగనాథన్



● రవిశంకర్, బుచ్చిబాబు, హను, సాయి, ప్రదీప్, మమిత, కీర్తీశ్వరన్, నవీన్

''తెలుగు ప్రేక్షకులు నా సినిమాలన్నింటినీ గొప్పగా ఆదరించారు. మీ అభిమానానికి కృతజ్ఞతలు. మీ కుటుంబంలో ఒకరిగా చూసినందుకు చాలా థ్యాంక్స్. నేను నటించిన 'లవ్ టుడే, డ్రాగన్' సినిమాలు మీకు నచ్చినట్లయితే.. మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన 'డ్యూడ్' చిత్రం కూడా కచ్చితంగా అందరికీ నచ్చుతుంది. నాకు మంచి ఛాన్స్ ఇచ్చిన మైత్రి మూవీ మేకర్స్‌కి ధన్యవాదాలు'' అని ప్రదీప్ రంగనాథన్ చెప్పారు. కీర్తీశ్వరన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్, మమిత బైజు జంటగా నటించిన చిత్రం 'డ్యూడ్'. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ నిర్మించిన ఈ చిత్రం నేడు తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి దర్శకులు హను రాఘవపూడి, బుచ్చిబాబు, సాయి రాజేశ్, రాహుల్ సాంకృత్యాన్, మహేశ్, శివ నిర్వాణ అతిథులుగా హాజరై, 'డ్యూడ్' ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. కీర్తీశ్వరన్ మాట్లాడుతూ- ''నేను 'డ్యూడ్' స్క్రిప్ట్ రాసుకుని దర్శకుడు కావాలనుకున్న తర్వాత చెన్నై మొత్తం తిరిగాను. ఫైనల్‌గా మైత్రీ మూవీ మేకర్స్‌లో నా సినిమా ప్రయాణం ప్రారంభం అయింది. ఈ బ్యానర్‌లో పని చేస్తానని నా కలలో కూడా అనుకోలేదు'' అని చెప్పారు. ''అందమైన ప్రేమకథగా రూపొందిన ఈ చిత్రంలో బలమైన భావోద్వేగాలు ఉన్నాయి'' అని రవిశంకర్ అన్నారు. ''ఈ సినిమా తప్పకుండా అందర్నీ అలరిస్తుంది'' అని నవీన్ యెర్నేని పేర్కొన్నారు. ఈ వేడుకలో కెమెరామేన్ నికిత్ బొమ్మి, సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్, పాటల రచయిత రామజోగయ్య శాస్త్రి తదితరులు మాట్లాడారు.

ఎల్లమ్మలో...



● దేవిశ్రీ ప్రసాద్

ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ హీరోగా నటించనున్నారని తెలిసింది. 'బలగం' ఫేమ్ దర్శకుడు వేణు యెల్దండి తర్వాతి చిత్రం 'ఎల్లమ్మ'. ఈ సినిమాను 'దిల్' రాజు నిర్మించనున్నారు. విలేజ్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో హీరోగా నాని, నితిన్ వంటి వార్ల పేర్లు తెరపైకి వచ్చాయి. తాజాగా ఈ సినిమాలో దేవిశ్రీ ప్రసాద్ హీరోగా నటించనున్నారనే వార్త ప్రచారంలోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన సంప్రదింపులు జరుగుతున్నాయని, ఈ చిత్రంలో నటించేందుకు దేవిశ్రీ కూడా ఆసక్తి చూపిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది.

పడి పడి నవ్వుకుంటారు

- కిరణ్ అబ్బవరం




● జైన్స్ నాని, శివ, రాజేష్ దండ, యుక్తి తరేజా, కిరణ్ అబ్బవరం

''కె-ర్యాంప్' చిత్రం మేము అనుకున్నదానికంటే ఇంకా బాగా వచ్చింది. ఈ సినిమాని అనుకున్నప్పుడే దీపావళికి రిలీజ్ అని ఫిక్స్ అయ్యాం. థియేటర్స్‌లోకి వెళ్లేముందు ఇది పూర్తి వినోదాత్మక చిత్రం అని గుర్తుపెట్టుకోండి. కచ్చితంగా పడి పడి నవ్వుతారు. మీ టికెట్ డబ్బులు వృథా కావు.. ఇందుకు నాది గ్యారెంటీ'' అని కిరణ్ అబ్బవరం తెలిపారు. ఆయన హీరోగా, యుక్తి తరేజా హీరోయిన్‌గా నటించిన చిత్రం 'కె- ర్యాంప్'. జైన్స్ నాని రచన, దర్శకత్వంలో హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్‌పై రాజేష్ దండ, శివ బొమ్మకు నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి దర్శకులు విజయ్ కనకమేడల, వీఐ ఆనంద్, రామ్ అబ్బరాజు, సుబ్బు, చంద్రమోహన్ అతిథులుగా హాజరై,''దీపావళి పండగ కళ 'కె-ర్యాంప్'లో కనిపిస్తోంది. ఈ సినిమా మంచి విజయం సాధిస్తుంది'' అని తెలిపారు. రాజేశ్ దండ మాట్లాడుతూ- ''మేము ఎంత ఏడ్చినా, తొడలు కొట్టినా, ఎన్ని చెప్పినా సినిమాలో కంటెంట్ ఉంటేనే ప్రేక్షకులు ఆదరిస్తారు. ఈ దీపావళికి రిలీజ్ అవుతున్న సినిమాలన్నీ బ్లాక్‌బస్టర్ కావాలి'' అని తెలిపారు. ''మా సినిమా అదిరిపోయింది. ఈ దీపావళికి పెద్ద హిట్ అవుతుంది'' అన్నారు జైన్స్ నాని. ''తెలుగులో నేను చేసిన మూడో చిత్రమిది. 'కె-ర్యాంప్' చూశాక ప్రేక్షకులు నన్ను మరింతగా ఇష్టపడతారు'' అని యుక్తి తరేజా పేర్కొన్నారు.

ఓటీటీ | ఇది చూడొచ్చు

సమయం విలువ తెలిపే సినిమా

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం 'ది డెస్పరేట్ అవర్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఓ ఆలోచన కథగా మారి సినిమాగా రావాలంటే ఎంతో మంది మార్పులం, వ్యయ ప్రయాసలు అవసరం. కానీ రచయితకు వచ్చిన ఆలోచనను దర్శకుడు నేర్పుగా తెరకెక్కిస్తేనే ప్రేక్షకులు ఆ సినిమాకి దగ్గరవుతారు. ఇప్పుడున్న ట్రెండ్‌కి అనుగుణంగా ఓ సినిమా తీయాలంటే కత్తి మీద సామే. ఎందుకంటే నేటి తరం ప్రేక్షకులు దర్శకుల ఆలోచనను అరక్షణంలోనే పట్టేస్తున్నారు. అందుకేనేమో ఇప్పటి దర్శకులు తమ సినిమాలలో వైవిధ్యానికి పెద్ద పీట వేస్తున్నారు. అటువంటి వారిలో హాలీవుడ్ దర్శకులు కాస్త ముందుంటారనే చెప్పాలి. ఆ కోవకు చెందిన వాటిలో వచ్చినదే దర్శకుడు ఫిలిప్ నాయిస్ తీసిన 'ది డెస్పరేట్ అవర్' సినిమా. ఈ సినిమాని ఈయన 2021లోనే తీశారు. ఈ చిత్రం విడుదల తరువాత భారతదేశంలో చాలా సినిమాలు ఇదే పంథాలో వచ్చినా పెద్దగా గుర్తింపు రాలేదు. ఈ సినిమా నిజానికి ఓ బ్యూటిఫుల్ క్రాఫ్ట్ అని చెప్పవచ్చు. మరీ ముఖ్యంగా కొత్తగా సినిమా తీయాలనుకునే ఔత్సాహికులకు ఇదో చక్కటి పాఠం లాంటిది. ఇక థ్రిల్లింగ్ జోనర్ ఇష్టపడే ప్రేక్షకులకు ఇదో కన్నుల పండగలాంటిది. అంతలా ఏముంది సినిమాలో ఓసారి చూద్దాం. అమీకార్ తాను రోజూ వెళ్ళే జాగింగ్‌కి రెడీ అవుతుంది. ఇంతలో ఇంట్లో తన కొడుకు నోవా బెడ్ రూమ్‌లోనే బద్ధకంగా పడుకుండడం చూసి ఈ రోజు హెల్త్ బాగా లేకపోతే స్కూల్‌కి వెళ్ళవద్దు అని చెప్పి జాగింగ్‌కు బయలుదేరుతుంది. జాగింగ్‌లో అమీకార్ ఎప్పుడూ హెడ్ ఫోన్స్ పెట్టుకునే వెళుతుంది. కొంత సమయం జాగింగ్‌లో గడిచాక నోవా స్కూల్ నుండి ఓ ఫోన్ వస్తుంది. ఓ ఆగంతకుడు గన్‌తో స్కూల్‌లో చొరబడ్డాడని, పెద్ద ప్రమాదం జరగబోతోందని స్కూల్ ప్రిన్సిపల్ చెబుతుంది. ఇంతలో మరో ఫోన్ కాల్ ద్వారా తన కొడుకు నోవా స్కూల్‌కి వెళ్ళాడని, సరిగ్గా ఆ ఆగంతకుడి చేతికి చిక్కాడని తెలుస్తుంది. అమీకార్ ఆ సమయంలో స్కూల్‌కి చాలా దూరంలో జాగింగ్ చేస్తుండడంతో ఏం చేయాలో తెలియక టాక్సీకి కబురు పెడుతుంది. టాక్సీ రావడానికి చాలా సమయం పడుతుండడంతో కంగారు పడుతుంది. ఇక అక్కడి నుండి అమీ తన దగ్గరున్న ఫోన్‌తో కొడుకును కాపాడుకుంటుందా? లేదా అన్నదే సినిమా. ఇక్కడ విషయం ఏమిటంటే తొంభై శాతం అమీ జాగింగ్‌లోనే సినిమా నడుస్తుంది. సినిమాలో ఇంకెవ్వరూ కనిపించరు. భారీ తారాగణంతో, బీభత్సమైన విజువల్స్‌తో గ్రాండియర్ ఫీస్ట్‌తో తీసిన సినిమాలు కనీసం కాసులు కూడా రాల్చలేని నేటి రోజుల్లో ఒక్కటంటే ఒకే పాత్రతో 84 నిమిషాల నిడివితో సినిమాని తీసిన ఈ దర్శకుడికి నిజంగా హ్యాట్సాఫ్ చెప్పాలి. ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ అవుతున్న ఈ సినిమాని మీరు కూడా చూసేయండి. మస్ట్ వాచ్ ఇట్.

– హరికృష్ణ ఇంటూరు